# ఆవుతల్లి



దట్ల నారాయణమూర్తి రాజు

ముంజూర్లో చేతుల కుర్చీలో కూర్చుని వీధి వేపు చూస్తున్నాడు వెంకట చయనులు.

ఎదురుగా వీధికి అటుపక్క పిచ్చి మొక్కలతో నిండిన మైదానం. దానికి ఎడమ వేపున గజపతుల కాలంనాడు కట్టించిన పాడుపడ్డ భవనం తనలాగే వుందనిపించింది. వీ ధి లో పో యే మనుషులు. సంవత్సరాల తరబడి వాళ్ళ ముఖాలు తెలుసు. తన ముందు తన తరంవారు ఎందరో వెళ్ళిపోయారు. ఆనాటి అనుభవాలతో, అప్పటి రోజుల్ని తలచుకుంటూ ఈ వీధిలో అరడజను మంది మాత్రమే మిగిలారు. అందులో తనొకడు.

కదలలేని పరిస్థితిలో, పక్షవాతంతో రోజంతా వీధిలో పోయే మనుషుల్ని, ఇటూఅటూ పోయే రిక్షాల్ని, జట్కాల్ని, అప్పుడప్పుడు వెళ్ళే కార్లను చూస్తూ— వెంకట చయనులు.

పెరట్లో భార్య సోమిదేవమ్మ తులసి ముందు ప్రదక్షిణ చేస్తూ చదివే మంత్రాలు వినబడుతున్నాయి. అప్పుడప్పుడు పాకలోంచి అరిచే ఆవు అరుపు వినబడుతోంది.

ఎడమ గోడవేపు చూసాడు.

అక్కడ గోడకు తగిల్చిన పటంలో

నవ్వుతూ కనిపించే పెద్దకొడుకు. అలా రెండు నిమిషాలు కొడుకు వేపు చూసాడు. వెంకట చయనులు మనసులో దుఃఖం ఒక్కసారి పొంగింది. కళ్ళలో కనీ కనబడని కన్నీళ్ళు. తుడుచుకోవడానికి ప్రయత్నం చేయబోయాడు. కుడి చెయ్యీ, కుడి కాలూ పక్షవాతంతో పడి పోయాయి. ఎడంచెయ్యి కూడా అంతంత మాత్రం.

"కాఫీ తీసుకోండి" సోమిదేవమ్మ, ఎదురుగా ఇత్తడి గ్లాసును వెంకట చయనులు పెదవులకు అందిస్తూ అన్నది. అతి కష్టంమ్మీద మోచేతులతో గ్లాసును గట్టిగా పట్టుకుని తాగడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

సోమిదేవమ్మ ఒక్కసారి భర్త కళ్ళ వేపు చూసింది.

"పోయినోడి గురించి బాధపడితే మాత్రం.... తిరిగొస్తాడా...." ఎంతో అనునయంగా అని, కాళీ కాఫీగ్లాసుని తీసుకుని లోనికి వెళ్ళింది. అప్పుడావిడకు ఎదిగిన పెద్దకొడుకు, అతని జ్ఞాపకాలు ఒక్కసారి గుర్తుకొచ్చాయి. పైటచెంగు నోట్లో పెట్టుకుని భర్తకు వినపడకుండా చాలాసేపు ఏడ్చిందావిడ.

అది మామూలే. రోజూ ఆ దంపతులు పెద్దవాణ్ణి తలచుకుని బాధపడి, ఒకర్ని వొకరు ఓదార్చుకుంటూ ఒకరికి తెలియకండా ఇంకొకరు ఏడుస్తుంటారు.

"చయన్లుగారూ...." ఆ పిలుపుకి ఎదుటి మనిషివేపు చూసాడు వెంకట చయనులు.

"ఏఁవోయ్.... రా....రా.... చాల్రోజులికి వచ్చావే...." అ వచ్చిన వ్యక్తిని పలకరించాడు. ఆ వ్యక్తి ముంజూరు దాటి, లోన మట్టిఅరుగు మీద, పెచ్చులూడిపోయిన స్తంభాని కాను కుని కూర్చున్నాడు.

"ఏఁవిటి.... అందరూ బాగున్నారా..." అడిగాడు చయనులు.

"ఏదో.... మీ దయవల్ల.... మీకు తెలుసుగా.... మీ చేతుల మీదుగా అమ్మాయికి మీరే పెళ్ళి జరిపించారు.... తమకు జ్ఞాపకం వుండుంటుంది.... పదిహేనేళ్ళ తర్వాత దానికి కడుపు పండింది.... ఆడపిల్ల పుట్టింది...." శుభవార్త చెప్పాడు.

"అహఁ.... అలాగ ఎంత సంతోషం వార్త చెప్పావయ్యా .... అప్పల స్వామీ...." అని "ఏమేవ్.... ఆ పంచాంగం ఒక్కసారి పట్రా...." అని భార్యను కేకేసాడు.

సోమిదేవమ్మ మధ్య గదిలో గోడకి మేకునవున్న పంచాంగాన్ని తీసి తెచ్చి భర్త చేతికిచ్చింది.

"అయితే బారసాల ముహూర్తం...."

"అవునండి.... బాబయ్యా ...." వివరాలు కనుక్కొని, మంచి ముహూర్తం చూసి చెప్పాడు వెంకట చయనులు. తర్వాత కొంతసేపు గడిచాక

అప్పలస్వామి లేస్తూ, తమలపాకులు, రెండు చక్కల మధ్య ఒక రెండ్రూపాయల నోటుని వుంచి, దాన్ని కుర్చీకి దగ్గరగా పెట్టి-

"దక్షిణ స్వీకరించండి...." అని అప్పలస్వామి నమస్కారంచేసి వెళ్ళిపోయాడు.

"ఏమేవ్.... ఇదిగో.... ఈ తాంబూలం తీసుకో...." సోమిదేవమ్మ లోన్నించి వచ్చి, చయనులు చేతిలోని పంచాంగాన్ని, తాంబూలాన్ని తీసుకుని లోనికెళ్ళింది.

ఇంతట్లో పెరట్లో పాకలోంచి అరిచే ఆవు అరుపు వినబడింది.

"చూడు.... దానికి రెండు గడ్డిపరకలు వెయ్యలేకపోయావా...."

సమాధానం రాలేదు. మళ్లీ అడిగేడు.

"వున్న కాస్తంత గడ్డీ పొద్దున్నే వేస్సాను.... వీధిలో ఏంవైనా గడ్డి మోపెత్తే బేరంవాడండి...." అని లోన్నించి సోమిదేవమ్మ బదులిచ్చి, కుడితిని తీసుకుని ఆవుముందు పెట్టింది.

"ఎండలు మండిపోతున్నాయి...." తనలో తనే అనుకుని "అమ్మాయొచ్చిందా...." అని భార్యని అడిగేడు.

"రాలేదండీ.... వచ్చే సమయం అయింది...."

మళ్ళీ వీధిలోకి చూస్తూ కూర్చున్నాడు వెంకట చయనులు.

అతని కొకసారి గడచిన రోజులు జ్ఞాపకాని కొచ్చాయి. తన తాతలు, ముత్తాతలు ఎంత గొప్పగా బ్రతికేరు. ఆ రోజులు వేరు, తన వంశమంతా పౌరోహిత్యమే ప్రధానంగా పెట్టుకుని జీవించారు. నిజంగా నియోగిరాజుల్లాగే బ్రతికేరు.

కానీ-

తను!

తండ్రిపోయాక తన చేతికి సంసార బాధ్యత లొచ్చాయి. రెండు సంవత్సరాలు హాయిగా గడిచాయి. ఆ తర్వాత పక్షవాతానికి దొరికిపోయేడు. ఎన్ని మందులు. ఎందరు డాక్టర్లు. ఏంవీ నయం కాలేదు. ఆదాయం పడిపోయింది. ఎదగని పిల్లలు. పెద్దవాడి చదువుకు వున్నదంతా హరించుకు పోయింది. వాడు చదివి వుద్యోగం చేస్తే తాము హాయిగా బ్రతకొచ్చని అనుకున్నారు. కానీ డిగ్రీవరకూ చదివిన వాడు, ఏదో వుదోగ్యం ఇంటర్వ్యూకి విశాఖపట్నం వెళ్ళి, మరి రాలేదు.

మూడో రోజునాడు తెల్సింది.

సి టీ బస్సు ప్రమాదంలో మరణించాడని.

అన్నీ దెబ్బల మీద దెబ్బలు. తినడానికే ఇళ్ళూ, వాకిళ్ళూ హారతి కర్పూరంలా కరిగిపోయాయి. ఆఖరకు మిగిలింది మూడుగదుల ఈ పూరిపంచ.

"ఇలా ఎన్నాళ్ళు.... చావు వచ్చిందాకా బ్రతకడం తప్పదు...."

వీధిలోకి చూసాడు వెంకట చయనులు.

కాలేజీనుంచి వస్తోంది కూతురు కళ్యాణి.

"ఏఁవమ్మా.... ఇంతాలిస్యం...." తండ్రి అడిగిన ప్రశ్నకు కూతురేం సమాధానం చెప్పలేదు. గడప దగ్గర హవాయి చెప్పుల్ని విడిచేసి లోనికెళ్ళింది.

"ఎండనబడి వచ్చింది...." అని అనుకుని, ఆ కుర్చీలోనే ఒక మాగన్ను తీయడానికి వుపక్రమించేడు వెంకట చయనుడు.

సోమిదేవమ్మ కళ్యాణికి వడ్డించాక, భర్తకూడా వడ్డించి, వాళ్ళ భోజనా లయాక తను తిన్నది. భోజనమై పోయాక, కొంతసేపు గడిచాక మళ్ళీ కాలేజీకి వెళ్ళిపోయింది కళ్యాణి. తిరిగి వచ్చేసరికి నాలుగున్నరయింది.

అప్పటికి వెంకట చయనులు అదే కుర్చీలో ఏమాత్రం మార్పులేకుండా కూర్చున్నాడు.

కళ్యాణి పుస్తకాన్ని గూట్లోపెట్టేసి, పెరట్లోకి వెళ్ళి ముఖం, కాళ్ళూచేతులూ కడుక్కొని, తల దువ్వుకుని వరండాలో కొచ్చింది. తండ్రివేపు ఒకసారిచూసింది.

ఆ అమ్మాయికి తండ్రిమీద చాలా కోపంగా వుంది. వారం రోజుల్నుంచి తను చెప్తున్నా, ఆ విషయాన్ని తండ్రి ఏమాత్రం పట్టించుకోవటం లేదు. అలా గని తండ్రిని గట్టిగా అడగనూ లేదు. కానీ ఇప్పుడు తప్పదు.

"నాన్నా...." మెల్లగా పిలిచింది.

"ఏఁవమ్మా...." తల తిప్పి కళ్యాణి వేపు చూసాడాయన. ఆ అమ్మాయంటే ఆయనకు ప్రాణం. దానిక్కారణం చని పోయిన కొడుకు రూపురేఖలన్నీ కళ్యాణిలో వున్నాయి. వాడిలాగ చక్కటి కళ్ళు, వెడల్పాటి నుదురు. సూదిముక్కు. మాట్లాడుతున్నపుడు బుగ్గనపడే సొట్ట. అన్నీ వాళ్ళన్నయ్యలాగే.

"ఏం కావాలి....తల్లీ ...." కూతురి వేపు ప్రేమగా చూస్తూ అడిగాడు.


"నే నడిగిన విషయం ఏంచేశావు.... పరీక్షఫీజు కట్టడానికి ఎల్లుండే ఆఖ రోజు....అదీ ఫైన్‌తోటి .... అదిగాని మనం కట్టలేకపోతే .... పరీక్షకు కూర్చోడం....అవదు...."

"ఎల్లుండేనా...." కూతురుని అడిగి నట్టుగా తనలో తనే అనుకున్నాడు వెంకట చయనులు. కొంచెంసేపు ఆలో చించి–

"రేపేర్పాటు చేస్తాను...అలాగేనా..." అని కూతురి కళ్ళల్లోకి చూడలేక చూసాడు. అపుడా సమయంలో కళ్యాణి చూపుల్లో కనబడిన భావం ఎలాంటిదో, ఏఁవిటో అర్థంకాలేదు ఆయనకు.

"ఏఁవిట్నాన్నా .... నా చదువుమీద ఏమాత్రం శ్రద్ధలేదు...." అనేసి, గబ గబా ఇంట్లోకి వెళ్ళిపోయింది కళ్యాణి.

"నీ చదువుమీద శ్రద్ధలేదా తల్లీ.... వుందమ్మా....వుంది...ఎందుకు లేదు..." గొణుక్కున్నాడు వెంకటచయనులు.




పరిస్థితులు బాగుంటే పెద్దకొడుకుని లాయర్ గా చెయ్యాలనుకున్నాడు. కూతుర్ని డాక్టర్ చదువు చదివించా లనుకున్నాడు. మనం అనుకున్నట్టుగా పరిస్థితు లుండవు కదా! ఆఖరికి కూతుర్ని ఫీజులవీ తక్కువగా వుంటాయని సంస్కృత కళాశాలలో భాషాప్రవీణ చదివిస్తున్నాడు. అయినా ఆ ఫీజులుకూడా కట్టలేకపోతున్నాడు.

తన బ్రతుకు ఇంత దరిద్రంగా ఎందుకై పోయింది. తన కలలన్నీ తన కళ్ళ ముందే ఎందుకు కరిగిపోయాయి. చివరికింత అధ్వాన్నంగా పూటపూటకు తిండి కూడా దేవులాడుకునే పరిస్థితి ఎందుకొచ్చింది. దాన్నెలాగూ పైచదువులు చదివించలేకపోయాడు. ఇదైనా చదివించగలిగితే ఏదో బడిపంతులు పనిచేసుకుని తన కాళ్ళమీద తను నిలబడుతుంది. అయినా ఎలాగ? తన పరిస్థితిని ఎవరితో చెప్పుకుంటాడు. చెప్పుకున్నా తనని ఆదుకునేవా రెవరున్నారు. తను బాగున్న రోజుల్లో ఎంతోమందిని ఆదుకున్నాడు. వారెవరూ ఇప్పుడు కనిపించరేం. ఒకనాడు కప్పల్లా వచ్చిన బంధువులు, మిత్రులు ఈనాడు దారంట వెళ్తూ గుమ్మంలోకి తొంగిచూడరు!

అలాగ చాలాసేపు ఆలోచనల్లో గడిపాడు వెంకటచయనులు.

సన్నగా మసకచీకటి దుఃఖంలా, అది రాత్రాను వెంకటచయనులు మనసులోని బాధలా చిక్కగా, దట్టంగా అలుముకుంది.

"చీకట్లో కూర్చున్నారేం.... ఇంట్లోకి వస్తారా...." దీపంబుడ్డిని ద్వారబంధం దగ్గర పెడుతూ అడిగింది సోమిదేవమ్మ.

వెంకటచయనులు సమాధానం చెప్ప లేదు. తర్వాత మళ్ళీ అరగంట తర్వాత వచ్చి అన్నది.

"భోజనం వడ్డించాను...." నెమ్మదిగా కుర్చీలోంచి లేచి, దేకురుకుంటూ వెళ్ళి రెండు మెతుకులు అయిష్టంగా తిని లేచి పోయాడు.

కూతురు రెండో గదిలో పాణినీ వ్యాకరణ సూత్రాల్ని వల్లిస్తోంది. సోమిదేవమ్మ నులకమంచమ్మీద బొంత వేసి, దానిమీద చిరుగులదుప్పటి పరిచింది.

"పక్క వేశాను...." చెప్పి లోన కెళ్ళింది భార్య.

వెంకట చయనులకి నిద్రపట్టలేదు. చీకటిముద్దగా కనబడే చూరువేపు, అస్ప ష్టంగా కనబడే గోడలవేపు చూస్తూ చాలా సేపు గడిపాడు.

రెండో గదిలో కళ్యాణి చదువాపి, పడుకుంది.

సోమిదేవమ్మ భోజనంచేసి వచ్చింది. గోడకి పెట్టిన బుడ్డిదీపం వత్తిని తగ్గిం చింది. చాప వేసుకుని, పాతచీరల్ని చుట్టలుచుట్టి తలకింద పెట్టుకుని పడుకో బోతూ భర్తవేపు చూసింది.

"చాలా పొద్దుపోయింది .... పడు కోండి..." ఆ మాటకు వెంకటచయనులు అటుపక్కనుంచి ఇటు తిరిగి భార్యవేపు చూసాడు. సోమిదేవమ్మ అయనవేపే చూస్తోంది.

అప్పుడు వెంకట చయనులు ఇలా అన్నాడు:

"సోమీ....మన బ్రతుకు లెందుకిలా అయిపోయాయి...." ఆ గొంతులో విన బడిన విషాదానికి సోమిదేవమ్మ గుండె తరుక్కుపోయింది.

తన భర్త గురించి ఆమెకు బాగా తెల్సు. ఎంతో దుఃఖం వస్తేనే గానీ, అయన బైటపడరు. చాపమీద నుంచి ఆవిడ లేచి, మంచంమీద అయన తల పక్కన కూర్చుంది.

"వూరుకోండి.... బాధపడితే బాధలు తీరుతాయా..." భర్త నుదురుమీద చెయ్యివేసింది.

"బాధలు తీరనప్పుడు, కష్టాల్లో ఆదు కునేవాడు లేనప్పుడు, భార్యని పిల్లల్నీ పోషించలేనపుడు .... నాలాంటి వాడికి మిగిలింది బాధపట్టంవేకదా....సోమీ...." సాదాగా అన్నాడాయన.

"మన రోజులు మంచివి కావు.... అంతే....దానికి ఎవర్నని ఏంవిలాభం... అసలే మీ ఆరోగ్యం మంచిది కాదు.... నిరంతరం బాధపడితే .... బాధలు పోతాయా...."

"పోవు....కానీ....నువ్వు చూస్తూనే వున్నావు....ఇవాళ పిల్ల ఫీజు కట్టడాని క్కూడా పైసపైస వెతుక్కోవాల్సి వస్తోంది..." వెంకట చయనులు ఆమాట

అంటున్నపుడు సోమిదేవమ్మ ఆయనకళ్ళ వేపు చూసింది. ఎంత అపుకుందామన్నా ఆగని, ఆయన మనసులోని దుఃఖానికి కళ్ళు చెమర్చి, అవి బుగ్గలమీద నుండి బొట్లుబొట్లుగా కంఠంమ్మీదకు జారుతున్నాయి.

సోమిదేవమ్మ పైటచెంగు తీసి ఆయన కళ్ళు, కనుబొమలు, బుగ్గలు, కంఠమ్మీద తడిని తుడిచింది. తుడిచి-

"నిండుగుండే మీరే నిబ్బరాన్ని సడలించుకుంటే....నా మాటేమిటి....ఏడ...వకండి .... ఎక్కడో ప్రయత్నిద్దాం.... తప్పుతుందా... ఇన్నిరోజు లెలాగెళ్లాయి ఇదీ అలాగే..." ధైర్యంగా అన్నదావిడ.

"ఎక్కడ ప్రయత్నిస్తాం సోమీ.... తిండానికి .... వున్నవన్నీ అమ్మేసుకొన్నాం.... ఎటుచూసినా అప్పులు.... ఆఖరుకు మనం మిగిలాం...మన్ని మనం అమ్ముకోవాలి...." అధైర్యంగా అన్నాడాయన.

"ఆ భగవంతుడు ఏదో దారి చూపించకపోడు...." ఆయన ఆమాట వినిపించుకోలేదు.

గోడకి తగిలించిన బుడ్డిదీపం వత్తి తగ్గించడం వలన వుండుండి భగభగ మండుతోంది. పెరట్లోంచి గాలి, రివట్లా వచ్చి తాకుతోంది. అప్పుడప్పుడు పెరట్లో కొబ్బరిరెమ్మలు కదిలినపుడు వెండి మువ్వలు కదులుతున్నట్లుగా చప్పుడు.

అదే సమయంలో పెరట్లో పాకలోంచి ఆవు అరుపు వినబడింది.

"రేపైనా గడ్డి కొనాలి....పిచ్చి ముండ .... ఇవాళంతా కుడితి తాగే నిలబడింది...." సోమిదేవమ్మ తనలో తాను అనుకుంది.

"మనలాగే....మనం నిండుగా తిన్నాం కనుక...." నవ్వేడు చయనులు.

అప్పు డాయనకు చటుక్కున ఏదో బుర్రలో మెరిసింది. భార్యవేపు ఆలోచనగా చూసాడు.

"చూడు సోమీ....మన సరస్వతిని అమ్మేస్తే...."

"ఆవుని అమ్మడమా...." ఆవిడ ఆశ్చర్యాన్ని ప్రకటించింది. చిన్నప్పట్నుంచీ ఆ ఆవు చిన్నపిల్లలా తమింట్లో పెరిగింది. రెండో కూతురిలా చూసుకుంటున్నారు. అందుకే చక్కగా, దానికి సరస్వతి అని పేరుకూడా పెట్టుకున్నారు. పోయినవన్నీ పోగా దా న్నే పరిస్థితుల్లోనూ అమ్మకూడదని నిశ్చయించుకున్నారు. అది ముసిలైపోయేవరకు తమింట్లోనే వుంటుందనుకుం దావిడ.

"ఈ పరిస్థితుల్లో మరే ఆధారం వుందని...." ఆ మాటకు సమాధానం చెప్పలేదావిడ. కానీ ఇప్పుడు ఇలాగైనా రోజులు గడుస్తున్నాయంటే అదే ఆధారం వని భర్తతో చెబ్దామనుకుంది. కానీ ఎందుకో చెప్పలేదు.

సోమిదేవమ్మ మంచమ్మీదనుంచి లేచి

చాపమీద పడుకుంది. వెంకట చయనులు మంచంమ్మీద అటుప్రక్కకు తిరుగుతూ అన్నాడు.

"సరస్వతిని రేపు సంతకు తీసుకెళ్తాను...."

ఆ మాటకు సోమిదేవమ్మ ఏ సమాధానమూ చెప్పలేదు.

* * *

కాలేజీకి వెళ్తూ 'నాన్నేడమ్మా' అని కళ్యాణి వాళ్ళమ్మ నడిగింది.

"నాన్న....పక్కింటి శర్మను తీసుకొని, సరస్వతిని అమ్మడానికి సంతకెళ్లారు...." తల్లి చెప్పింది.

"సరస్వతిని అమ్మేస్తున్నారా...." కళ్యాణి మనస్సు చివుక్కుమంది. సరస్వతి తనతోపాటు పెరిగింది. అదంటే తనకు ప్రాణం. ఆ అమ్మాయికి ఎందుకో మనసంతా కకావికలమైపోయింది.

ఎండ చాలా తీక్షణంగా వుంది.

ఉదయం కాఫీ తాగి వెళ్ళాడు వెంకట చయనులు. కర్రలమార్కెట్టు పక్కన సంత జరుగుతుంది. ఎవరైనా పశువుల్ని కొనాలన్నా, అమ్మాలన్నా అక్కడికే తీసుకువస్తారు.

ఆవుని పట్టుకుని నిల్చున్నాడు శర్మ. ఆ పక్కన నేలమీద కూర్చున్నాడు వెంకట చయనులు. ఎవరో వస్తున్నారు. అడుగుతున్నారు. వెళ్తున్నారు. అతను చెప్పిన ధరకు సగానికి సగం తగ్గించేసి అడుగుతున్నారు.

సూర్యుడు నడినెత్తిమీద కొచ్చాడు.

"బేరం కుదురుతుం దంటావా...." ప్రక్కన నిలబడిన పదిహేనేళ్ళ శర్మను అడిగాడు వెంకట చయనులు.

"ఇలాగే అడుగుతారు చిన్నాన్నా. వెంటనే అమ్మకూడదు...వాళ్ళేవస్తారు... చూడు...." శర్మ చెప్పాడు.

విపరీతంగా దాహంగా వుంటే అక్కడేదైనా మంచినీళ్ళకోసం ప్రయత్నించాడు. ఎక్కడా దొరకలేదు. దూరంగా కిళ్ళీబడ్డీ దగ్గరకెళ్ళి శర్మ షోడా తెచ్చిచ్చాడు. వెంకట చయనులు మనసు కొంచెం స్తిమితపడింది.


ఉదయం నుంచి ఏఁవీ పెట్టలేదు ఆవుకి. కనీసం కుడితైనా! గడ్డిపరకలు నిన్నటినుంచీ లేవు. ఈ ఎండను తనే భరించలేకపోతున్నాడు. బేరం వేగిరం అయిపోతుందనుకున్నాడు. కానీ ఎక్కడా బేరం కుదరటంలేదు.

సూర్యుడి కిరణాలు ఎరుపు రంగులోంచి విరిగి బూడిదరంగులో కొచ్చాయి.

"ఇవాళ మరి లాభంలేదు చిన్నాన్న.... రేపొద్దాం...." శర్మ అన్నాడు.

"వెళ్ళిపోదాఁవంటావా...." అటూ ఇటూ చూసాడు వెంకట చయనులు. సంతలో చాలా తక్కువమంది జనం వున్నారు. చాలామంది తమ పశువుల్ని ఇళ్ళకు తోలుకుని వెళ్ళిపోతున్నారు.

అక్కడ రాటకి కట్టిన తాడుని విప్పాడు శర్మ. సరస్వతి ఆకలిచూపు



లతో, వెంకట చయనుల్ని చూసింది. వెంకట చయనులు శర్మ భుజాన్ని పట్టుకుని అతి కష్టంమ్మీద నడుస్తూ ఇంటి ముఖం పట్టేడు.

* * *

చేతులకుర్చీలో కూర్చుంటూ తుండుగుడ్డతో చెమటను తుడుచుకున్నాడు వెంకటచయనులు.

"దానికేఁవైనా గడ్డిపరక లుంటే పడెయ్యి.... పుదయంనించీ ఎండిపోయింది పాపం...."లోనికి కేకేసాడు.

"గడ్డిపరకలు కొనడం కుదర్లేదు...." డబ్బుల్లేక కొనలేదని చెప్పలేక సోమిదేవమ్మ కుడితిని తీసికెళ్ళి సరస్వతి దగ్గర పెట్టింది. అది అబగా తాగింది.

"రేపైనా అమ్మెయ్యాలి" పడుకునే ముందు అనుకున్నాడు వెంకటచయనులు.

"ఏఁవండీ...." భార్య పిలుపుతో మెలుకువొచ్చింది వెంకట చయనులుకి.

అప్పటికింకా పూర్తిగా వెలుతురింకా రాలేదు. భార్య చెప్పిన మాటలు విని ఆశ్చర్యపోయాడు. గబగబా మంచం దిగి దేకురుకుంటూ పెరట్లో పాక దగ్గరి కెళ్ళాడు.

పెరట్లో పాకకిందు ఎండుగడ్డి పరకల మధ్య లుంగలు కొరుస్తూ, కాళ్ళు కొట్టుకుంటూ ఆవుతల్లి కనబడింది.

"ఏమైంది.... ఏమైంది.... ఏమైంది ... నా సరస్వతి కేమైంది...." దాదాపు ఏడుస్తున్నట్టుగా అడిగేడు.

సోమిదేవమ్మ జవాబుఏం చెబుతుంది. ఏం చెయ్యాలో తోచక గిలగిల కొట్టుకుంటున్న సరస్వతి ఎప్పట్నించి గింజుకుంటుందో, గింజుకుని, గింజుకుని ఆఖరు శ్వాస విడిచింది.

* * *

పూర్తిగా వెలుగొచ్చింది. కబురంపితే మాదిగరావుడొచ్చి పదిరూపాయలిచ్చి చచ్చిపోయిన ఆవుని పట్టుకుపోయాడు. ఆ ఆవును తీసుకెళ్ళిపోతున్నపుడు స్వంత చెల్లెలు పోయినప్పుడు ఏడ్చినట్టుగా ఏడ్చింది కళ్యాణి. పెంచలేక రెండో కొడుకుని దత్తత ఇస్తున్నప్పుడు ఏడ్చినట్టుగా ఏడ్చింది సోమిదేవమ్మ. పెద్దకొడుకు పోయినపుడు ఏడ్చినట్టుగా ఏడ్చాడు వెంకటచయనులు.

* * *

ముంజూర్లో చేతుల కుర్చీలో వీధి వేపు చూస్తున్నాడు వెంకటచయనులు.

ఉదయం నుంచీ చిన్న చినుకులు. రొజ్జగాలి. మధ్యగదిలో కూర్చుని పెరట్లో పాకవేపు చూస్తోంది సోమిదేవమ్మ. కళ్యాణి ద్వారబంధానికి ఆనుకుని కూర్చుంది.

వర్షం రాత్రానూ ఎక్కువైంది.

ఎదురుగా గజపతుల కాలంనాడు కట్టించిన శిథిలభవనం వర్షంలో నానుతోంది. అలా వర్షం ఎంతసేపు పడిందో తెలీదు. కొంతసేపటికి ఆ మేడ తాలూకా మొండిగోడలు జారిపోయాయి. ఆ తర్వాత ఒక్కసారి దబ్బుమని ఆ మేడ నిలువుగా కూలిపోయింది.

"నాన్నా.... రాజుల మేడ పడిపోయింది...." ఆశ్చర్యంగా తిరిగి అన్నది కళ్యాణి. అపుడు కళ్యాణి తులుక్కుపడింది.

పెరట్లో నిన్న చచ్చిపోయిన ఆవు కళ్ళు జ్ఞాపకాని కొచ్చాయి. అంతంత పెద్దకళ్ళు. ఆ కళ్ళలో జీవంలేకపోయినా ఏదో ప్రేమ కనబడినట్టయింది. తండ్రి కళ్ళు కూడా అలాగే వున్నాయి. ఆ కళ్ళని చూసి కళ్యాణి ఝడుసుకుంది.